క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 12న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కనకదుర్గ కాలనీ, మహతి స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు కేయూలో విస్తృతోపన్యాసం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలోని సెమినార్ హాల్‌లో ఈనెల 12న ఉదయం 11గంటలకు ఆ కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ ఆడెపు రమేష్.. విస్తృతోపన్యాసం చేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లినికల్ ఫార్మసీ ప్రాక్టీస్ – ఏ టూల్ ఫర్ బెటర్ పేషెంట్ కేర్ అనే అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

మైనార్టీ విద్యార్థులు నేరుగా అడ్మిషన్ పొందవచ్చు

న్యూశాయంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న మైనార్టీ గురుకులాల్లో మైనార్టీ కేటగిరికి చెందిన విద్యార్థులు 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్ పొందవచ్చని టెమ్రిస్ అకడమిక్ అధికారులు తెలిపారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిస్థాయిలో పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించినట్లు వివరించారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ



హసన్‌పర్తి: హసన్‌పర్తి తహసీల్ కార్యాలయాన్ని హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ రహీం, ఆర్ఐలు ఫాజల్, కుమారస్వామి పాల్గొన్నారు.

నర్సింహమూర్తికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన పీఎల్.నర్సింహమూర్తికి హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కస్టమర్ మేనేజ్‌మెంట్ టువర్డ్స్ డిజిటల్ బ్యాంకింగ్ ఏ సెలక్ట్ స్టడీ అనే అంశంపై కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు నర్సింహమూర్తి సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధిపతి రాజేందర్ పర్యవేక్షణలో నర్సింహమూర్తి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నోట్‌బుక్స్ పంపిణీ



దేశాయిపేట: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని మసూంఅలీ పాఠశాల విద్యార్థికి పూర్వ విద్యార్థి యర్రం రమేష్ గురువారం నోట్‌బుక్స్‌ను అందజేశారు. ఈమేరకు పూర్వ విద్యార్థులు వలపదాసు రవి, డాక్టర్ కొణతం కృష్ణ, కుమ్మరికుంట్ల శ్రీనివాస్, ఆడెపు రమేష్, ఈగ రమేష్, పోశాల సురేందర్ నోట్‌పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డాక్టర్ బీవీఎస్.స్వామి, ఉపాధ్యాయులు జయ బాల రెడ్డి, కనకయ్య, భిక్షపతి, శ్రీధరాచార్యులు, కిషన్, దేవేందర్, మోహన్, ఉమ పాల్గొన్నారు.

కంప్యూటర్ల బహూకరణ



హసన్‌పర్తి: హనుమకొండలోని బాసిత్‌నగర్ పాఠశాలకు కిట్స్ కళాశాల సౌజన్యంతో రెండు కంప్యూటర్లు, ప్రింటర్‌తో పాటు స్పోర్ట్స్ సామగ్రిని గురువారం బహూకరించారు. కిట్స్ కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కిట్స్ కళాశాల కోశాధికారి నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ కోమల్‌రెడ్డి, ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జెండా భూమిపై మత విద్వేషాలు?

ఖిలా వరంగల్: మధ్యకోటలో ఓ జెండా గద్దె స్థలం విషయంపై మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 100ఏళ్ల చరిత్ర గల జాతీయ జెండా గద్దె స్థలాన్ని ఇటీవల కొంతమంది వ్యక్తులు వక్ఫ్ బోర్డు స్థలంగా చిత్రీకరించినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన జాతీయ వాదులు, స్వాతంత్ర్య సమరయోధులు అయోమయానికి గురవుతున్నారు. ఈ జెండా గద్దె చిచ్చు ఎటు దారి తీస్తుందోనని స్థానికులు సైతం ఆందోళనకు గురవుతున్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



కాశిబుగ్గ: సమావేశంలో నాయకులు



కాళోజీ సెంటర్: వినతిపత్రం అందజేస్తూ..

హన్మకొండ: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్.మోహన్, రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రావీణ్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు డీఆర్‌లు విడుదల చేయాలని, అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్ స్కీమ్‌ను వర్తింపజేయాలని, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నారాయణ రావు, నరసింహారెడ్డి, సరళ, వెంకటరెడ్డి, జగదీష్ చంద్రరెడ్డి, నాగేశ్వర్ రావు, వీరభద్రారెడ్డి పాల్గొన్నారు.

15న కలెక్టరేట్ల ముట్టడి

కాశిబుగ్గ: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న జిల్లా పెన్షనర్ల కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పెన్షనర్లు భారీగా తరలిరావాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం వరంగల్ జిల్లా శాఖ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈమేరకు నగరంలోని కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అందజేయాలని, నూతన పీఆర్సీ, ఐఆర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు వెలిశోజు రామ మనోహర్, రాజయ్య, సుధీర్‌బాబు, రవిందర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో..

కాళోజీ సెంటర్: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి శ్రీకాంత్ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్ మోహన్, రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు సోమయ్య, కార్యదర్శి లక్ష్మారెడ్డి, కుమారస్వామి, మల్లయ్య, సత్యనారాయణ, వీరయ్య, రామ్మోహనాచారి, నిజామొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నాస్తిక సమాజం మహాసభను విజయవంతం చేయాలి



మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆయా సంఘాల నాయకులు

హన్మకొండ: హనుమకొండలో జరగనున్న భారత నాస్తిక సమాజం మూడవ మహాసభను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ పిలుపునిచ్చారు. మహాసభ వాల్‌పోస్టర్లను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 24న హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పీఆర్.రెడ్డి భవన్‌లోని డాక్టర్ జయగోపాల్ ప్రాంగణంలో మహాసభను నిర్వహించనున్నట్లు తెలిపారు. సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కోఆర్డినేటర్ చార్వాక, భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబయ్య, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ వైస్ చైర్మన్ వనజ, రాష్ట్ర కమిటీ సభ్యుడు చక్రధర్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటా..



అనాథలను పరామర్శిస్తున్న మంత్రి సురేఖ

కాశిబుగ్గ: నగరంలోని చెన్నారెడ్డి కాలనీలో దంపతులు స్వప్న, చరణ్ మృతితో అనాథలైన ముగ్గురు పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటానని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. ఆ ముగ్గురు పిల్లలను మంత్రి గురువారం పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధుడైన షాలుమ్‌కు వైద్య పరీక్షలు చేయిస్తానని, పిల్లలను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పించి చదివిస్తానని అన్నారు. అలాగే, వారి కోసం ఇల్లు కూడా నిర్మిస్తానని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట కార్పొరేటర్ వస్కుల బాబు, నాయకులు పోలెపాక ఏసు, జన్ను రవి, చందర్, రాజేష్ ఉన్నారు.

డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు, అభ్యర్థులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో డీఎస్సీ అభ్యర్థుల పరిస్థితిని అర్థం చేసుకొని తక్షణమే పరీక్షలను మూడు నెలలపాటు వాయిదా వేయాలని పీడీఎస్‌యూ, ఏబీఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు, ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని గతకొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు అభిరామ్, దార సురేష్, నరేందర్, బండారి పృథ్వీరాజ్, డీఎస్సీ అభ్యర్థులు శ్రీకాంత్‌రెడ్డి, పృథ్వీరాజ్, క్రాంతికిరణ్, శంకర్, శారద, మల్లేష్, నాగరాజు, లక్ష్మణ్, అనిల్, రవిందర్ పాల్గొన్నారు.

దళారులను ప్రజలు ఆశ్రయించొద్దు



తహసీల్దార్ ఇక్బాల్

సాక్షి స్పందన

వరంగల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు కుటుంబ అవసరాల నిమిత్తం తీసుకునే ధ్రువీకరణ పత్రాల జారీ కోసం దళారులను ప్రజలు ఆశ్రయించవద్దని వరంగల్ తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్ సూచించారు. 'దళారులు చెప్తేనే.. ధ్రువీకరణ పత్రం' అనే శీర్షికన సాక్షి దినపత్రికలో బుధవారం వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తాను వరంగల్ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటికి 6,863 ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 6,677 పత్రాలు జారీ చేసినట్లు వివరించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ధరణి దరఖాస్తులను విచారించి పరిష్కరిస్తామని చెప్పారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి గడువు లోపు జారీ చేస్తున్నట్లు తెలిపారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



వరంగల్ లీగల్: సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై ఏఎస్సై దాడికి నిరసనగా రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేస్తూ ధర్నా చేశారు.

శ్వేతార్కలో స్కంద పంచమి

కాజీపేట: కాజీపేటలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్కంద పంచమి వేడుకలను గురువారం నిర్వహించారు.

సంతాప సభను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నాయకురాలు రాధక్క సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు కోరారు. ఈనెల 14న ఖిలా వరంగల్ ఫోర్ట్ రోడ్డులో జరగనున్న సంతాప సభ వాల్‌పోస్టర్లను వరంగల్ చౌరస్తాలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాయకుడు గంగుల దయాకర్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోవర్దన్, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంధ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, న్యూడెమొక్రసీ నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బండి కోటేశ్వరరావు, గంగుల దయాకర్, రాచర్ల బాలరాజు, గంద్రతి హరిబాబు, ఇనుముల కృష్ణ, వీరన్న ఏలియా, రాజనర్సు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్ రెడ్డి

ఖిలా వరంగల్: కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ అండగా నిలిచి పోరాడుతోందని సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి తెలిపారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో గురువారం జరిగిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల పునరుద్ధరణకు ఐక్య పోరాటాలకు కార్మిక లోకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, మునేశ్వర్, ఎండీ.ఖాసీం, యాకోబ్, దామెర కృష్ణ, గోవర్ధనాచారి, తాళ్లపల్లి జాన్‌పాల్, సంగి ఎలేందర్, సంద్ర కుమార్, బొట్ల శ్రీనివాస్‌కుమార్, నాగవెల్లి శంకర్, ముకుందం, విక్టోరియా, సుమలత, శంకర్, చంద్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన



ప్రెస్ క్లబ్‌లో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

నయీంనగర్: ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ టీయూడబ్ల్యూజే (హెచ్ –143) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో జర్నలిస్టులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ వాయిదా వేయాలని ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు ఆందోళన చేస్తుంటే, దాన్ని కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్ట్ శ్రీచరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. బాధ్యులైన పోలీసులపై ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, కార్యదర్శి నాయకపు సుభాష్, వరంగల్ జిల్లా కన్వీనర్ కక్కెర్ల అనిల్‌కుమార్ గౌడ్, యూనియన్ నాయకులు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, అంతడుపుల శ్రీనివాస్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

'సింహగర్జన'ను విజయవంతం చేయాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

కాజీపేట రూరల్: సికింద్రాబాద్‌లో శుక్రవారం జరగనున్న రైల్వే మజ్దూర్ యూనియన్ సింహగర్జన ధర్నా కరపత్రాలను కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచ్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీజిల్ బ్రాంచ్ సెక్రటరీ పాక వేదప్రకాష్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు, నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ రవీందర్ ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ జానీమియా, ట్రెజరర్ జి.రాజేశ్వర్‌రావు, నాయకులు ఎస్.తిరుపతి, యాదగిరి, ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

విద్యారణ్యపురి: జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూటీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి ఇతర బాధ్యులు డీఈఓ వాసంతిని కోరారు. నూతనంగా డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన వాసంతిని గురువారం సాయంత్రం పీఆర్టీయూ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్‌గఫార్, పీఆర్టీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ వాసంతికి శుభాకాంక్షలు

హనుమకొండ జిల్లా డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన వాసంతిని టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు గురువారం కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్ రాజు, జనరల్ సెక్రటరీ పెండెం రాజు, కోశాధికారి కిరణ్‌కుమార్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీఎస్ఆర్ మల్లిక్, బాధ్యులు శ్రీనివాస్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

కాజీపేట అర్బన్: బండ కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ భావుసింగ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. న్యూశాయంపేట జాగీరులోని సర్వే నంబర్ 579లోని కందులబండ క్వారీపై 60 ఏళ్లుగా బండ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న 380 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు కేటాయించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

దేశాయిపేట: నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లిలో జన్ను రెడ్డి, జన్ను పోశమ్మలు ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. బాధిత కుటుంబాలను నాయకుడు జన్ను అరుణాకర్, నాయకుల గురువారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి 50కిలోల బియ్యంతో పాటు ఆర్థికసాయం అందజేశారు.

14 నుంచి జ్ఞాన యజ్ఞ సప్తాహం

హన్మకొండ: హనుమకొండలోని సాయిబాబా మందిరంలో జ్ఞాన యజ్ఞ సప్తాహం నిర్వహించనున్నట్లు దేవాలయ చైర్మన్ హరిగోపాల్ తెలిపారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు ఉదయం 7నుంచి 8గంటల వరకు, సాయంత్రం 6.30నుంచి 8గంటల వరకు యజ్ఞానంద స్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో వివరించారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

వరంగల్ క్రైం: ఈనెల 21న గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్‌లోని ఎల్లం బజార్‌లోని సాయి సేవాదళ్ మందిరంలో వేడుకలు నిర్వహించనున్నట్లు సాయి సేవాదళ్ అధ్యక్షుడు ఆరుట్ల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను సీపీ అంబర్ కిషోర్‌ఝా చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు.

దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

కాజీపేట రూరల్: కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గాను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య బుధవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దర్గా పీఠాధిపతి, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూపాషా, మత పెద్దలు స్వాగతం పలికి సన్మానించారు.

ఆ భూములను కొంటే వేటు తప్పదు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సూదన్‌పల్లి గ్రామంలో భూస్వాముల నుంచి పోరాడి సాధించుకున్న భూములను ఎవరు కొనుగోలు చేసినా ప్రజాగ్రహానికి గురికాక తప్పదని మావోయిస్టు జేఎండబ్ల్యూపీ కమిటీ హెచ్చరించింది. ఈమేరకు కరపత్రాన్ని విడుదల చేసింది. సూదన్‌పల్లికి చెందిన పెసరు రాంచంద్రారెడ్డికి చెందిన ఎనభై ఎకరాల వ్యవసాయ భూమిలో 35 ఏళ్ల క్రితం 20 ఎకరాల్లో మావోయిస్టులు జెండాలు పాతారు. జెండా పాతిన భూములను 42 మంది నిరుపేద దళితులకు పంపిణీ చేశారు. అప్పటి నుంచి ఆ భూములను దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని కమిటీ పేర్కొంది.

రైల్వే సివిల్ ప్రిన్సిపాల్‌కు అభినందన

కాజీపేట రూరల్: దక్షిణ మధ్య రైల్వే సివిల్ ఇంజినీరింగ్ విభాగం నూతన ప్రిన్సిపాల్ చీఫ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన పీఎస్.బ్రహ్మానందంను కాజీపేట రైల్వే కన్‌స్ట్రక్షన్ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బద్దియా అజ్మీర శుక్రవారం కలిసి అభినందించారు. కాజీపేట బల్లార్ష సెక్షన్‌లో జరుగుతున్న మూడవ రైల్వేలైన్ అభివృద్ధి పనుల పురోగతిని బ్రహ్మానందంకు వివరించారు.

శ్రీసాయి మహాన్ పుస్తకం ఆవిష్కరణ

హన్మకొండ చౌరస్తా: గట్ల రోజాశ్రీ రాసిన శ్రీసాయి మహాన్ పుస్తకాన్ని హనుమకొండ పద్మాక్షికాలనీలోని ద్వారక సాయిబాబా ఆలయంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ తోట వెంకటేశ్వర్లు గురువారం ఆవిష్కరించారు.. అనంతరం, వెంకటేశ్వర్లును ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి నల్లెల్ల సుదర్శన్, కృష్ణమూర్తి, తోట శ్రీనివాస్, కాంగ్రెస్ 10వ డివిజన్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్మాదిని ఉరి తీయాలి

హన్మకొండ: ప్రేమోన్మాది మేకల నాగరాజును నడిరోడ్డుపై ఉరి తీయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకు మహిళలు, బాలికలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్, శ్రీనివాస్ నాయక్, భాస్కర్ నాయక్, మోహన్ నాయక్, వసంత నాయక్, అభివర్మ నాయక్ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి దేవాలయ పరిసర కాలనీ, అపార్ట్‌మెంట్స్ అభివృద్ధి నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మార్త రాజేందర్, ఉపాధ్యక్షుడిగా తిరువరంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.సాంబశివరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టి.మహేందర్‌రావు, కోశాధికారిగా ఎం.రాంప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్.సంజీవ, పి.కిషన్‌రావు, పి.లక్ష్మీప్రసాద్, ఎస్.రవీందర్‌రావు, నిశాంత్, ప్రదీప్‌రావు, ఆశిష్‌ను ఎన్నుకున్నారు.

గోవిందరాజుల గుట్టపైకి రోడ్డు వేయాలి

వరంగల్ చౌరస్తా: వరంగల్‌లోని భూనీల సమేత గోవిందరాజుల దేవస్థానంపైకి రోడ్డు మార్గం నిర్మించాలని, మండపం, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్, తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా

హన్మకొండ చౌరస్తా: పేద విద్యార్థులు చదువుకునే 4వ డివిజన్ పెద్దమ్మగడ్డలోని పాలెం ప్రభుత్వ పాఠశాల సమస్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా తెలిపారు. స్థానికులతో కలిసి గురువారం పాఠశాలను సందర్శించి ఆవరణలో నిలిచి ఉన్న వరదనీటిని పరిశీలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వరంగల్: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని కారల్‌మార్క్స్ నగర్‌లో బుధవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో తీవ్రంగా గాయపడిన బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య, నేషనల్ కాంగ్రెస్ వర్కర్స్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అడుప మహేష్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని వారు భరోసా ఇచ్చారు. నాయకులు సొరం అభిలాష్, చిన్నయ్య, పి.చందు, టోనీ, ప్రకాశం, అభిషేకం, లింగస్వామి, వినయ్, అఖిల్, రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

కాశిబుగ్గ: మహిళలు ఆర్థికంగా ఎదిగి, ఇతరులకు ఉపాధి కల్పించాలని ఎంఎస్ఎంఈ ప్రోగ్రాం డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ రావు సూచించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంలో సొసైటీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు 45 రోజుల ఉచిత బ్యూటీషియన్ కోర్సును గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సిద్ధార్థరెడ్డి, మా జనని ఉమెన్ సోషల్ సర్వీస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు వడ్డేపల్లి మాధవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆడెపు స్వప్న, మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్సు యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

ఖిలా వరంగల్: తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) అఫిలియేటెడ్ టూ నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్‌యూజే) ఇండియా వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని బొమ్మరిది ప్రాంగణంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ అధ్యక్షతన గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోతరవేని రాజన్న, ప్రధాన కార్యదర్శిగా లింగబత్తిని కృష్ణ, ఉపాధ్యక్షులుగా కందికొండ గంగరాజు, శీలం రమేష్, కోశాధికారిగా బత్తుల సత్యం, సహాయ కార్యదర్శులుగా ఈద శ్రీనాథ్, వల్లెపు భాగ్యరాజు, నాగపూరి నాగరాజు, సహాయ కోశాధికారిగా ఆవునూరి కుమారస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రావుల నరేష్, పంచకం నర్సయ్య, అడుప అశోక్, కార్యవర్గ సభ్యులుగా పారిజాతం సంతోష్‌కుమార్, గొనె కమలాకర్, నాగపూరి అవినాష్, సుంకరి కల్యాణ్ ఎన్నికయ్యారు.

నామినేటెడ్ పదవికి పరిశీలించండి

హసన్‌పర్తి: నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న తన పేరును నామినేటెడ్ పదవి కోసం పరిశీలించాలని కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి బూర సారంగపాణి కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

కాజీపేట రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని సికింద్రాబాద్, కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులు కోరారు. ఈమేరకు ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి అశోక్‌కుమార్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే ఎస్సీ, ఎస్టీ ఆపరేటింగ్ అండ్ కమర్షియల్ బ్రాంచ్ సెక్రటరీ, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కెఎస్.రావు, సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ ఎ.రాజశేఖర్, జోనల్ ట్రెజరర్ నాగేశ్వర్‌రావు, జోనల్ అదనపు కార్యదర్శి మంత్రి నాయక్ పాల్గొన్నారు.

బీవీపీ ఆవిర్భావ దినోత్సవం

విద్యారణ్యపురి: భారత వికాస్ పరిషత్ (బీవీపీ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీవీపీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని డెఫడైల్స్ హైస్కూల్‌లో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీపీ వ్యవస్థాపకుడు డాక్టర్ సూరజ్ ప్రకాశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

ఎల్కతుర్తి: గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటుపడి విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కాజీపేట ఏసీపీ తిరుమల్ హెచ్చరించారు. భీమదేవరపల్లి మండలం ములకనూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై మోడల్ స్కూల్ విద్యార్థులకు కల్పించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 100 లేదా 87126 71111 నంబర్లకు కాల్ చేసి గంజాయి సమాచారం అందించాలని సూచించారు.

ప్రజలకు మనోధైర్యం కల్పిస్తాం..

ఖిలా వరంగల్: ప్రజలు, ప్రయాణికులకు మనోధైర్యం కల్పిస్తామని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్ నాయక్ భరోసా ఇచ్చారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వరంగల్ స్టేషన్ రోడ్డు, కాశిబుగ్గ, శంభునిపేట జంక్షన్లను ఇన్‌స్పెక్టర్లతో కలిసి గురువారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకతాయిల ఆగడాలను అరికట్టడుతున్నామని చెప్పారు.